# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 21.09.2025 | 24 క్యారెట్లు 9,88.300 | కిలో వెండి 1,20,000 | 30 °C | సంపుటి:3 | సంచిక:265

www.vishalabharati.com




# మెట్రో.. దారి ఎటో!

- ప్రశ్నార్థకంగా మెట్రో ప్రాజెక్టు భవిష్యత్
- మొదటి దశకు భారీ నష్టాలు
- వైదొలగనున్నట్లు ఎల్అండ్‌టీ ప్రకటన
- రెండో దశకు రాని అనుమతులు
- హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ తొలగింపు
- హైదరాబాద్ మెట్రోమ్యాన్‌గా గుర్తింపు
- మెట్రో భవితవ్యంపై నీలినీడలు

*మెట్రో ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు మొదటి దశకు సంబంధించి నష్టాలను భరించలేక నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు ఎల్అండ్‌టీ ప్రకటించింది. మరోవైపు రెండో దశ విషయంలో కేంద్రం నుంచి ఇప్పటివరకూ అనుమతి లభించలేదు. పైగా ఇప్ప ట్లో ఆ అవకాశం కూడా లేదు. మొదటి దశ రైలు మార్గాలపై సమన్వయం కుదిరే వరకు ఈ ప్రతిష్టంభన ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి కూడా పట్టుమని పది కిలోమీటర్ల లైన్‌లు నిర్మాణమయ్యే దాఖలాలు కనిపించడం లేదు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఒకవైపు మెట్రోను వదులుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ ప్రకటించిన వెంటనే హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఆ బాధ్యతల నుంచి తప్పించి హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. మెట్రో రైల్ నిర్మాణదశ నుంచి ఇటీవల వరకు సుమారు 18 సంవత్సరాల పాటు ఈ రంగంలో అపారమైన అనుభవాన్ని ఆర్జించిన హైదరాబాద్ మెట్రోమ్యాన్‌గా గుర్తింపును పొందారు.ఆ స్థాయిలో

మిగతా 2లో



# మెట్రోపై కేసీఆర్ కుట్ర

## మెట్రో నుంచి ఎల్ అండ్ టీ తప్పుకోలేదు

- సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు
- మొదటి దశ మెట్రోకు నష్టాలు
- కేసీఆర్ తప్పిదాల వల్లే పరిస్థితి
- అడ్డుగా కిషన్ రెడ్డి, కేసీఆర్
- 2017 నాటికి ప్రాజెక్ట్ పూర్తి
- కేంద్రం సహకారం అందించాలి

*హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ నుంచి ఎల్ అండ్ టీ కంపెనీ నిష్క్రమించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ హైదరాబాద్ మెట్రో మొదటి దశలో నష్టాలు చవి చూశామని పేర్కొన్నదని సీఎం స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ఎల్ అండ్ టీ తప్పిదాల వల్ల కొన్ని సమస్యలు ఎదురయ్యాయని ఆయన అన్నారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మెట్రో రెండో దశ పనులను ముందుకు తీసుకెళ్లడంలో ఎల్ అండ్ టీ సహకరించాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమ రాజకీయ స్వార్థాల కోసం మెట్రో రెండవ దశ పనులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నార ని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. 2017 నాటికి మెట్రో ప్రాజెక్ట్ మొత్తం పూర్తి కావాల్సి ఉండగా.. మాజీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు ప్రాజెక్టు ముందుకు సాగలేదని ఆయన సీఎం తీవ్ర స్థాయిలో విమర్శించారు. అలాగే, ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించడం లేదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రతి సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ అండ్ టీ షరతులు విధిస్తే, రాష్ట్ర ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండబోదని ఆయన హెచ్చరించారు. సంస్థ రాష్ట్రంతో సహకరించి పని చేయాల్సిన బాధ్యత ఉందని, షరతులు విధించడం కాదని ఆయన అన్నారు. మెట్రో విస్తరణకు అనుమతులు ఇవ్వాలంటే ఎల్ అండ్ టీతో కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలన్న కేంద్రం నిబంధనను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ల నాటకమని, వారు తమ రాజకీయ అజెండా కోసం ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఆయన సీఎం ఆరోపించారు. ప్రస్తుతం రోజూ సుమారు 5 లక్షల మంది ప్రయాణికులు హైదరాబాద్ మెట్రోను ఉపయోగిస్తున్నారని, రెండవ

మిగతా 2లో



# మహిళలకు 41.51 కోట్ల రుణాలు

- మహిళలకు ప్రభుత్వం గుడ్ న్యూస్
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు
- కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రులు సీతక్క, వివేక్, పొన్నం
- 8,130 మహిళలకు లబ్ధి చేకూరనుంది
- మహిళల సంఘాలకు చెక్‌లు అందజేత
- మొదటి ఏడాదిలోనే 21,632 కోట్లు

*తెలంగాణ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ నగరంలోని మహిళా సంఘాలకు 41.51 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు అందించింది. శనివారం రోజున జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్‌గూడలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, వివేక్, పొన్నం ప్రభాకర్‌లు మహిళల సంఘాలకు చెక్‌లను అందజేశారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా స్వయంసహాయక సంఘాల కోసం వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ చేస్తున్నట్టుగా తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం తమ ప్రభుత్వం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తుందని తెలిపారు. పెట్టుబడుల కోసం మహిళలు వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి అధిక వడ్డీకి డబ్బు తెచ్చుకొని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఇక నుంచి వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్లాల్సిన పని లేదు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వమే అందిస్తుందని

మిగతా 2లో

# రేవంత్ పులి బిడ్డా.. పేపర్ బిడ్డా?

- కర్ణాటక ప్రభుత్వంపై కవిత విమర్శలు
- ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచకూడదు
- దీనిపై ఉమ్మడి ఏపీలో జీవో ఉంది
- కృష్ణానది ఆనవాళ్లు కనిపించవు
- తెలంగాణలోని 5 జిల్లాలపై ప్రభావం
- ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలి
- ఈ అంశంపై మౌనంగా రేవంత్

2



*కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచాలి అని తీసుకున్న నిర్ణయాన్ని జాగృతి నాయకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా వ్యతిరేకించారు. "ఆల్మట్టి హైట్ పెంచకుండా ఉమ్మడి ఏపీలో జీవో ఉంది. హైట్ పెంచితే.. తెలంగాణకు కృష్ణానది ఆనవాళ్లు లేకుండా పోతాయి. అప్పుడు క్రికెట్ ఆడటానికి తప్ప తెలంగాణ పొలాలు దేనికీ పనికిరావు" అంటూ ఆమె హెచ్చరించారు.*



# తెలుగు ప్రజల బతుకులు నాశనం

- హెచ్-1బీ వీసాలపై ఛార్జీలు పెంపు
- వెల్లడించిన డొనాల్డ్ ట్రంప్
- తెలంగాణకు తీవ్ర నష్టం
- యువత భవిష్యత్తుపై ప్రభావం
- భారీ శాపంగా మారే అవకాశం
- వీసాల్లో మొదటి స్థానంలో భారత్
- టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న హెచ్-1బీ వీసాలపై ఛార్జీలు భారీగా పెంచడం తెలంగాణకు తీవ్ర నష్టం కలిగిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దూదం శ్రీధర్ బాబు

మిగతా 2లో

# జెన్ జెడ్ ఉద్యమాలు తప్పవు

- ప్రభుత్వానికి వ్యతిరేక ఉద్యమాలు
- కేటీఆర్ హెచ్చరించారు
- యువత ఆకాంక్షలు ఆకాశా
- అభివృద్ధిని మోడీ గాలికి వదిలారు
- వెనుకబడిన దేశాలతో పోలికలు
- డిజిటల్ యుగానికే పరిమితం కావద్దు
- భారత్ వేదికగా క్వాడ్ సమ్మిట్



*యువత ఆకాంక్షలను విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె. తారక రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని కేటీఆర్ విమర్శించారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మసీద్, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారు అనే అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రధాని మోదీ గాలికొదిలేశారన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలతో పోటీపడి

మిగతా 2లో




# ఇక అమెరికా ఆశల్లేనట్లే!

- హెచ్-1బీ వీసాపై ట్రంప్ నిర్ణయం
- మొదటి దశకు భారీ నష్టాలు
- సర్వత్రా విమర్శలు వస్తున్నాయి
- వార్షిక ఫీజును 1లక్ష డాలర్లు
- వలసల నియంత్రణకే నిర్ణయం
- 70 శాతం భారతీయులే
- 11.7 శాతంతో చైనాకు రెండో స్థానం

2

# ఎయిర్‌పోర్టులో రూ.12 కోట్ల గంజాయి



- విమానాశ్రయంలో డ్రగ్స్ స్మగ్లింగ్
- భారీ ఆపరేషన్‌ను చేపట్టారు
- భారీగా హైడ్రోఫోనిక్ స్వాధీనం
- పోలీసులు అదుపులో మహిళ
- లగేజీలో గుర్తించి సీజ్ చేశారు
- అధికారులు షాక్ అయ్యారు
- బ్యాగులలో 3.8 కేజీల బంగారం

2

*శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డ్రగ్స్ స్మగ్లింగ్‌కు చెక్‌పెట్టారు అధికారులు. మరో భారీ ఆపరేషన్‌ను అధికారులు విజయవంతంగా నిర్వహించారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి వద్ద భారీ మొత్తంలో హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రేవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అనుమానం వచ్చి మహిళను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేపట్టారు.*

## తెలంగాణలో రేపు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

**హైదరాబాద్:** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రేపు(సెప్టెంబర్ 21, ఆదివారం) తెలంగాణ అంతటా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు జిల్లాల్లో కుండపోత తప్పదంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో.. మహబూబ్‌నగర్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబాబాద్, కొత్తగూడెం, సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉరుములు, పిడుగులతో కుంభవృష్టి కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం నుంచి ఎండలు దంచి కొడుతూ.. సాయంత్రం సమయంలో వర్షాలు కురుస్తున్నాయి. ఐఎండీ అంచనా ప్రకారం ఈ నెలలో సాధారణం కంటే 109% అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

# మెట్రోపై కేసీఆర్ కుట్ర

మొదటి పేజీ తరువాయి

దశ పూర్తయితే ఈ సంఖ్య 15 లక్షలకు పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం విచారణ సీబీఐకి ఇవ్వమన్నారు.. ఇచ్చిన తర్వాత బీజేపీ మాట్లాడటం లేదు. సీబీఐకి ఇస్తే 48 గంటల్లోనే తేల్చుతామన్న కిషన్ రెడ్డి ఎందుకు దాక్కున్నారో సమాధానం చెప్పాలి. సీబీఐ ఒకసారి ఎఫ్ఐఆర్ చేసిన తర్వాత ఎవరినైనా విచారించవచ్చు. కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఆపుతున్నారు. కిషన్ రెడ్డి ఆపుతున్నారు. 48 గంటల్లో తేల్చుతామన్న కిషన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు రియాక్ట్ అవ్వడం లేదు. ఫోన్ టాపింగ్ కేసు కోర్టులో ఉంది. కిషన్ రెడ్డికి సొంత ఆలోచనలు లేవు. కిషన్ రెడ్డి కేటీఆర్ ఏది చెబితే అదే చేస్తాడు' అని అన్నారు.

# జెన్ జెడ్ ఉద్యమాలు తప్పవు

మొదటి పేజీ తరువాయి

వారిని అధిగమించే ప్రయత్నం చేయాలి కానీ మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని హితవు పలికారు. శనివారం ముంబైలో జరిగిన "ఎన్డీటీవీ యువ 2025 - ద ముంబై ఛాప్టర్ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. జెన్ జెడ్ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర అంశాలపై మాట్లాడారు.

**డిజిటల్ మీడియాకు మాత్రమే జెన్ జెడ్ పరిమితం కావొద్దు..**

ప్రస్తుత యువతరం కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని, సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జెన్ జెడ్ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను ఆయన హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచారని పేర్కొన్నారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందని, ఇదే జెన్-జీ పవర్ అన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని.. రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే రాజకీయాలను ఎందుకు నిర్ణయించలేరు? అని యువతకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

**యువరక్తంతో ఉరకలేస్తున్న భారతదేశం**

ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారత్ మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానమే. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లు అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. నేడు చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లకు చేరితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా అమెరికా, యూరప్‌లతో పోటీపడితే, భారత్ మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతోంది" అన్నారు.

**అణుబాంబు దాడి జరిగినా జపాన్ ఎదిగింది..**

అణుబాంబు దాడితో నాశనమైన జపాన్, కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించింది. 1945లో హిరోషిమా, నాగసాకిలపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా ఆ దేశం కుంగిపోలేదు. ఎన్నో భౌగోళిక అననుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగింది. గత పదేళ్లలో తెలంగాణ సాధించిన ప్రగతిని కేటీఆర్ వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. ప్రపంచంలోనే అమెజాన్‌కు అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఉంది. కేవలం 10 ఏళ్లలోనే తెలంగాణ ఇన్ని చేయగలిగినప్పుడు, భారత్‌లోని మిగతా రాష్ట్రాలు ఎందుకు చేయలేకపోయాయని కేటీఆర్ ప్రశ్నించారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల వంటి వారు అమెరికా కంపెనీలకు సీఈవోలు అయితే సంతోషిస్తాం కానీ దేశంలో ఒక్క ప్రపంచ స్థాయి ఆవిష్కరణ కూడా రాలేదని పట్టించుకోవడం లేదు. దేశంలోని 38 కోట్ల జెన్ జెడ్ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచ గతిని మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలి.

**తెలంగాణలో ఆర్ఆర్ఆర్ పరిపాలన**

ప్రస్తుతం తెలంగాణలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తోందన్నారు కేటీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుతో ప్రజలు పోల్చి చూసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌ను గెలిపించుకోనందుకు రిగ్రెట్ అవుతున్నారు. త్వరలోనే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉందన్నారు.

# రేవంత్ పులి బిడ్డా.. పేపర్ బిడ్డా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దక్షిణ తెలంగాణలోని 5 జిల్లాలకు (మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్, జోగులాంబ గద్వాల) కృష్ణానది వరప్రదాయిని అనీ, కాబట్టి కృష్ణానది నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆమె డిమాండ్ చేశారు. "డ్యామ్ ఎత్తు పెంచకుండా అడ్డుకోవాలి. సీఎం రేవంత్ రెడ్డి.. పాలమూరు పులిబిడ్డో.. పేపర్ బిడ్డో తేలిపోతుంది. మేము బనకచర్లపై కోర్టుకు వెళ్తాం" అని కవిత తెలిపారు. కార్ణాటక క్యాబినెట్ ఈ నెల 17న యూకేపీ దశ-3ని ఆమోదించింది. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు 519.6 నుంచి 524.25 మీటర్లకు పెంచి, 100 టీఎంసీ అదనపు నీటి నిల్వ చేయాలనే ప్లాన్ ఉంది. ఇది తెలంగాణకు 100-130 టీఎంసీ నీరు తగ్గిస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల నెట్టెంపాడు (2.5 లక్ష ఎకరాలు), పాలమూరు-రంగారెడ్డి (5 లక్ష), కల్వకుర్తి (3.5 లక్ష) ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి. కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ 2013 అవార్డుపై సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ, కార్ణాటక ముందుకు సాగుతోంది. కృష్ణా వాటర్ బోర్డ్ సమావేశం ఒక వారంలో హైదరాబాద్‌లో జరగనుంది. "ఏపీకి చెందిన వారిని తెలంగాణ వాటర్ బోర్డులో అడ్వైజరీగా పెట్టుకున్నారు. ఆయన్ని తొలగించాలి" అని కవిత డిమాండ్ చేశారు. ఏపీకి చెందిన వారు తెలంగాణ బోర్డులో ఉంటే ఇక తెలంగాణకు న్యాయం ఎలా జరుగుతుంది అని ఆమె ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల్లో మునిగిపోయి, ఈ అంశంపై మౌనం పాటిస్తున్నారని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ "కాంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేయాలి" అంటోంది. ఈ వివాదం తెలంగాణ రైతుల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 17న జరిగిన ప్రత్యేక క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎత్తు పెంచాలంటే.. 1.33 లక్షల ఎకరాల భూసేకరణ అవసరం, ఇందులో 75,563 ఎకరాలు మునిగిపోతాయి. భూసేకరణకు మాత్రమే రూ.70,000 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. మొత్తం యూపర్ కృష్ణా ప్రాజెక్ట్ దశ-3కు రూ.1 లక్ష కోట్లు పడుతుంది. ఈ పెంపు ద్వారా డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం 123.08 టీఎంసీ నుంచి 200 టీఎంసీకి పెరుగుతుంది. ఇది కర్ణాటకలోని 5.94 లక్ష హెక్టార్ల పొలాలకు సాగునీటి అందించడంతో పాటు, 290 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పెంచుతుంది.

# ఎయిర్‌పోర్టులో రూ.12 కోట్ల గంజాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ తనిఖీల్లో రూ.12 కోట్లకు పైగా విలువ చేసే హైడ్రోఫోనిక్ గంజాయిని ఆమె లగేజీలో గుర్తించి గుర్తించి సీజ్ చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే గంజాయిని ఆమె విమానంలో ఎలా తీసుకువచ్చిందా అని షాకవడం అధికారుల వంతయింది.

**బాగా శుద్ధి చేసిన గంజాయి స్మగ్లింగ్...**

అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో సంబంధాలున్నాయన్న అనుమానంతో అధికారులు ఆమెను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. గోల్డ్, గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్ కోసం కొత్త మార్గాలు ఎంచుకుంటున్న వేళ, విమాన ప్రయాణాల్లో పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల రవాణా కేసులు పెరిగిపోతున్నాయి. ఈ ఘటనపై అధికారులు కేసు నమోదు చేసి, మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. దితురాలితో పాటు ఈ రవాణా వెనుక ఉన్న ముఠా గురించి సమాచారం వెలికితీసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**ఇటీవల 3.8 కేజీల బంగారం స్వాధీనం...**

ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండు రోజుల్లో వేర్వేరు బ్యాగులలో 3.8 కేజీల బంగారం లభ్యం కావడం కలకలం రేపింది. ఏపీలోని అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ వ్యక్తి, కడపకు చెందిన ఓ వ్యక్తి బంగారం స్మగ్లింగ్ చేద్దామని ప్రయత్నించారు. కానీ విమానాశ్రయంలో తనిఖీలు ముమ్మరం చేయడంతో దొరికిపోతామనే భయంతో బ్యాగులు అక్కడే వదిలేసి నిందితులు వెళ్లిపోయారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన అధికారులు మొత్తం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. రూ.3.6 కోట్ల విలువైన బంగారం ఒకరు లగేజీలో పెడితే, మరొకరు ఐరన్ బాక్సులో దాచి స్మగ్లింగ్ చేయాలని చూసి దొరికిపోయాడు.

# మహిళలకు రూ.41.51 కోట్ల రుణాలు

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. శనివారం 41.51 కోట్లు రుణాలను అందజేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 8,130 మహిళలకు లబ్ధి చేకూర్చామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... మొదటి ఏడాదిలోనే 21,632 కోట్లను అందించి రికార్డు సృష్టించామని చెప్పారు. హైదరాబాద్‌లో మహిళల వ్యాపారాల కోసం శిల్పారామంలో వంద దుకాణాలను కేటాయించామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా ఇప్పటికే 150 బస్సులు ఆర్టీసీకి లీజుకు ఇచ్చామని భట్టి తెలిపారు. త్వరలో మరో 450 బస్సులు ఇస్తామని చెప్పారు. మహిళలను మహాలక్ష్ములుగా చూడటం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అందుకే రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఇప్పటివరకు 222.50 కోట్ల ప్రయాణాలు ఉచితంగా జరిగాయని, మహిళలకు 7,000 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందుబాటులో ఉందని భట్టి తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం 96 లక్షల కుటుంబాలకు ప్రతి నెలా ఆరు కిలోల సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని చెప్పారు.

# మెట్రో.. దారి ఎటో!

మొదటి పేజీ తరువాయి



అనుభవాన్ని సంపాదించడానికి ప్రస్తుత ఎండీకి కొంత సమయం పట్టవచ్చు. పైగా ఆయనకు ఈ బాధ్యత అనేక సవాళ్లతో కూడుకొని ఉంది. సకాలంలో ఈ సవాళ్లను అధిగమించి రెండో దశ ప్రాజెక్టును పట్టాలెక్కించడం అంత సులువు కాకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**రెండు దశలు 'లింక్' అయ్యేనా..**

రెండో దశపై కేంద్రం లేవనెత్తిన ప్రశ్నలతోనే తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొదటి దశలోని 69 కి.మీ. అలైన్‌మెంట్‌కు కొనసాగింపుగానే ప్రభుత్వం వివిధ దశల్లో రెండోదశ విస్తరణకు ప్రణాళికలను రూపొందించింది. ఈ క్రమంలో ప్రైవేట్ సంస్థ అయిన ఎల్అండ్‌టీ నిర్వహణలో ఉన్న మొదటిదశకు, ప్రభుత్వమే చేపట్టి నిర్వహించనున్న రెండో దశకు సమన్వయం ఎలా ఉంటుందని కేంద్రం ప్రశ్నించింది. ఆదాయ, వ్యయాలు, రైళ్ల నిర్వహణ, విద్యుత్ వినియోగం, టికెట్ చార్జీల పంపకాలు వంటి అంశాలను ప్రస్తావించింది. ఈ క్రమంలో సమన్వయం సన్నద్ధతను తెలియజేయాల్సిన ఎల్అండ్‌టీ అందుకు భిన్నంగా ప్రాజెక్టు నుంచి తప్పుకొనేందుకే సిద్ధంగా ఉన్నట్లు సంచలన ప్రకటన చేసింది. తీవ్ర నష్టాల్లో ఉన్నట్లు మొదటి నుంచి ఆ సంస్థ ప్రతినిధులు చెబుతూనే ఉన్నారు. అదే నష్టాలను ప్రధాన సాకుగా చూపుతూ ప్రాజెక్టును వదిలించుకోనున్నట్లు పేర్కొంది. దీంతో మొత్తం రెండు దశల మెట్రో భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొదటి దశ నిర్వహణ కోసం ప్రభుత్వం ఎల్అండ్‌టీతో బేరసారాలు, బుజ్జగింపుల పర్వాన్ని కొనసాగించనుందా? లేక ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి రెండో దశల నిర్వహణకు అప్పగించనుందా? అనేది ప్రశార్థకంగా మారింది. ఒకవేళ అలాంటి ఎస్పీవీకి సానుకూలమైతే తిరిగి ఏదో ఒక ప్రైవేట్ సంస్థను ఎంపిక చేయాల్సిందే. కానీ.. మెట్రో నిర్మాణంలో, నిర్వహణలో అపారమైన అనుభవం ఉన్న ఎల్అండ్‌టీ స్థాయి సంస్థలు లేవనేది నిర్వివాదమైన అంశం. ఈ క్రమంలో ఎస్పీవీ ఏర్పాటు కూడా ఏ మాత్రం తేలికైన వ్యవహారం కాదు.

**చెల్లింపులు ఎలా..?**

నిధుల కొరత మరో సవాల్‌గా నిలిచింది. రెండో దశ కోసం అంతర్జాతీయ సంస్థల నుంచి పెద్ద ఎత్తున రుణాలను సేకరించాలనేది ప్రభుత్వ యోచన. కేంద్రం ఈ ప్రాజెక్టును ఆమోదించి తన వాటా నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలంటే జైకా వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలను సేకరించాల్సిందే. రెండో దశలో 'ఎ' విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీ,లకు సుమారు రూ.24,269 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. 'బి' విభాగం కింద ప్రతిపాదించిన మూడు మార్గాల్లో అంటే సుమారు 85 కి.మీ. మరో 19వేల కోట్లకు పైగా ఖర్చుకానుంది. ఇదే సమయంలో మొదటి దశ మెట్రో నిర్వహణ నుంచి ఎల్అండ్‌టీ వైదొలిగితే ఆ సంస్థకు దాదాపు రూ.6500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# ఇక అమెరికా ఆశల్లేనట్లే!

**విశాలభారతి, అంతర్జాతీయం:**

విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు చేసుకునేందుకు వీలు కల్పించే హెచ్?1బీ వీసా విషయంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్? తీసుకున్న తాజా నిర్ణయంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. హెచ్?1బీ వీసా వార్షిక ఫీజును 1లక్ష డాలర్లు చేస్తున్నట్టు ట్రంప్? చేసిన ప్రకటనతో వీసా ప్రోగ్రామ్‌కు ముగింపు పడబోతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ తీసుకున్న ఈ కఠినమైన వలసల నియంత్రణ నిర్ణయం ఎక్స్ (గతంలో ట్విట్టర్) లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇది భారతీయ టెక్ ఉద్యోగులపై భారీ ప్రభావం చూపుతుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే.. ప్రతి సంవత్సరం వేలాది మంది భారతీయులు, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేసేవారు, హెచ్1బీ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు చేస్తుంటారు.

**హెచ్?1బీ వీసా ఫీజుపై సోషల్ మీడియాలో స్పందనలు ఇలా..**

"ఇది చూడటానికి చాలా విచిత్రంగా ఉంది. కానీ కొత్తగా గ్రాడ్యుయేట్ అయిన వారికి ఉద్యోగాలు తగ్గిపోతున్న ఈ సమయంలో అమెరికాకు ఇది అవసరం అని నేను అనుకుంటున్నాను. దీని పర్యవసానాలు భారతదేశంపై చాలా తీవ్రంగా ఉంటాయి. హెచ్1బీ వీసాలపై అమెరికాలో అద్భుతమైన పనులు చేయగల గొప్ప ఇంజనీర్లు నాకు వ్యక్తిగతంగా తెలుసు. కానీ ఈ అనిశ్చితితో వారు ఇకపై సిలికాన్ వ్యాలీలోని ఒక అమెరికన్ కంపెనీ కోసం పనిచేయలేకపోవచ్చు," అని ఓ నెటిజన్? రాశారు. మరొకరు స్పందిస్తూ.. "ట్రంప్ నేరుగా భారతదేశాన్ని అడ్డుకోలేకపోవడంతో.. ఇప్పుడు పాలసీలను ఒక ఆయుధంగా వాడుతున్నారు. సంవత్సరానికి లక్ష డాలర్ల హెచ్1బీ ఫీజు, ఈ వీసాలలో 70శాతం మందిని పొందే భారతీయ నిపుణులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇది ఒక సంస్కరణ కాదు, భారతదేశ ప్రపంచ టెక్ ఎడ్జ్?ని బలహీనపరిచేందుకు ఉద్దేశించిన ఒక అడ్డుగోడ. తదుపరి లక్ష్యం మన ఐటీ రంగమే కావచ్చు! భారతదేశం దీనిని ఆర్థిక యుద్ధంగా గుర్తించి, వెంటనే ప్రతి-చర్యలను సిద్ధం చేసుకోవాలి," అని పేర్కొన్నారు. మరొక నెటిజన్ "భారతీయ టెకీలకు షాకింగ్ వార్త!" అని రాశారు. నాలుగో వ్యక్తి "భారతీయులపై అణు బాంబు వేశారు," అని రాశారు. గతేడాది హెచ్1బీ వీసాల లబ్ధిదారులలో భారతదేశం అతిపెద్దదిగా ఉంది. మొత్తం ఆమోదించిన వీసాల్లో 71శాతం భారతీయులకే లభించగా, చైనా 11.7శాతంతో రెండవ స్థానంలో ఉంది. కొలంబియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసిన, మన్‌హట్టన్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న డానియెల్ డి మార్టినో ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్) స్పందిస్తూ.. "హెచ్1బీ వీసా పొందడానికి లక్ష డాలర్ల ఫీజును జోడిస్తే ఈ ప్రోగ్రామ్?కి ముగింపు పడినట్టే! ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్?) రంగాలకు చాలా దారుణం. చాలా తక్కువ కంపెనీలు మాత్రమే ఉద్యోగి జీతంతో పాటు అతడిని స్పాన్సర్ చేయడానికి లక్ష డాలర్లు చెల్లిస్తాయి. అదృష్టవశాత్తూ, ఇది చట్టవిరుద్ధం," అని రాశారు.

కేటో ఇన్‌స్టిట్యూట్‌లోని ఇమ్మిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ డేవిడ్ జే బియర్ ట్వీట్ చేస్తూ.. "హెచ్1బీ అమెరికా కార్మికులకు హాని చేస్తుందనే ఆయన నిరాధారమైన కుట్ర సిద్ధాంతం ఈ చట్టవిరుద్ధమైన ఉత్తర్వుకు ఆధారం. కానీ ఇది అమెరికా కార్మికులకు నష్టం చేస్తుంది. దీనివల్ల వేతనాలు తగ్గుతాయి, ధరలు పెరుగుతాయి," అని పేర్కొన్నారు. "హెచ్1బీ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా కార్యక్రమం, అదనపు, అత్యంత నైపుణ్యం కలిగిన పనులను నిర్వహించడానికి తాత్కాలిక కార్మికులను యునైటెడ్ స్టేట్స్‌లోకి తీసుకురావడానికి సృష్టించారు. కానీ తక్కువ జీతం, తక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులతో అమెరికన్ ఉద్యోగులను భర్తీ చేయడానికి దీనిని ఉద్దేశపూర్వకంగా ఉపయోగించుకుంటున్నారు," అని ప్రకటనలో ఒక భాగం పేర్కొంది. "ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సంస్థలు హెచ్1బీ వ్యవస్థను అడ్డంగా ఉపయోగించుకుంటున్నాయి. దీనివల్ల కంప్యూటర్ సంబంధిత రంగాలలో అమెరికన్ కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఆర్థిక సంవత్సరం (ఎఫ్?వై) 2003లో హెచ్1బీ కార్యక్రమంలో ఐటీ కార్మికుల వాటా 32 శాతంగా ఉండగా, గత 5 ఆర్థిక సంవత్సరాల్లో ఇది సగటున 65 శాతానికి పైగా పెరిగింది," అని ఆ ప్రకటన కొనసాగించింది. "హెచ్1బీ వీసాకు లక్ష డాలర్ల చెల్లింపుతో దరఖాస్తు చేసుకునేవారికి తప్ప, ప్రత్యేక వృత్తులలో సేవలు అందించడానికి నాన్-ఇమ్మిగ్రెంట్‌లుగా విదేశీయుల ప్రవేశంపై పరిమితి ఉంటుంది," అని ఆ ప్రకటనలో ఉంది.

# తెలుగు ప్రజల బతుకులు నాశనం

మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ, "అమెరికా నిర్ణయాలు భారతదేశ యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపేలా ఉన్నాయి అని అన్నారు.

**తెలంగాణకు నష్టం, యువతకు దెబ్బ..**

ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల విదేశీ ఉద్యోగ అవకాశాలపై ఆశలతో ఉన్న తెలుగు యువతకి భారీ శాపంగా మారే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అమెరికాలో ఉద్యోగాలు చేసిన వారు ఇక్కడ ఉన్న తమ కుటుంబాలకు పంపించే డబ్బుపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నాయని, వారి జీవనోపాధిపై ఇది ప్రభావం చూపుతుందని అన్నారు. "ఇది కేవలం వీసా నిర్ణయం కాదు, ఇది లక్షల కుటుంబాల జీవితం మీద కత్తి" అని ఆయన విమర్శించారు.

**ఇండియన్ ఐటీ కంపెనీలకు భారీ బాదుడు...**

H1B వీసా పొందుతున్నవారిలో భారతీయులు అధిక శాతాన్ని కలిగి ఉన్నారని మంత్రి గుర్తు చేశారు. ఈ వీసాల్లో మొదటి స్థానంలో భారత్ ఉండగా, చైనా తర్వాత స్థానంలో ఉందన్నారు. ట్రంప్ ప్రభుత్వం తేచిన కొత్త నిబంధనల ప్రకారం, ఒక్కో కంపెనీ 1 లక్ష డాలర్లు చెల్లించాల్సి రావడం వల్ల టీసీఎస్, విప్రో,



ఇన్ఫోసిస్ లాంటి కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుందని చెప్పారు.

**కేంద్రం మౌనం వీడాలి...**

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అసలు స్పందించకపోవడాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. "అమెరికా నిర్ణయాల వల్ల మన దేశ పౌరులు నష్టపోతున్నా, కేంద్రం ఎందుకు ఒత్తిడి తేవడం లేదు?" అని నిలదీశారు. మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండటం విస్మయం కలిగిస్తోందని అన్నారు. మోదీ తన ఫ్రెండ్ అని ట్రంప్ అంటారు. మోదీ కూడా అదే మాట చెబుతారు. అయితే ఈ విధ్వంసకర నిర్ణయాలపై ఎందుకు స్పందించడం లేదు? దౌత్యపరంగా వెంటనే చర్చలు ప్రారంభించాలి" అని శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

**టాలెంట్‌కు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం..**

ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమెరికాలోని వ్యాపారవేత్తలే వ్యతిరేకిస్తున్నారని మంత్రి గుర్తు చేశారు. ఇది గ్లోబల్ టాలెంట్‌ను అడ్డుకునే చర్యగా వారు భావిస్తున్నారని చెప్పారు. ప్రత్యేకించి చిన్న, మధ్య తరగతి కంపెనీలకు ఇది భారీ ఆటంకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ఆర్థిక వ్యవస్థపై ప్రభావం...**

ట్రంప్ నిర్ణయం వల్ల కేవలం ఉద్యోగ అవకాశాలపైనే కాక, భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని మంత్రి అన్నారు. విదేశాల్లో పనిచేసే వారు ఇక్కడ పెట్టుబడులు పెడతారు. రియల్ ఎస్టేట్, బంగారం కొనుగోలు, ఇతర పెట్టుబడుల రంగాల్లో కూడా ఇది ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**తెలుగు రాష్ట్రాలకు ముప్పు...**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాది మంది యువత హెచ్-1బీ వీసాలపై అమెరికాలో పనిచేస్తున్నారు. వారి భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రం ఈ అంశాన్ని తేలికగా తీసుకోవడం తగదని, తాత్కాలిక ఉపశమనం కలిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

**ఇది భారతీయుల జీవితం..**

"ఇది రాజకీయ అంశం కాదు, ఇది లక్షలాది భారతీయుల జీవితం గురించి. కేంద్ర ప్రభుత్వం చురుకైన చర్యలు తీసుకోవాలి. చిన్న, మధ్య తరగతి కంపెనీలను కాపాడేందుకు ఆలోచించి, దౌత్యపరంగా అమెరికాతో చర్చలు జరపాలి" అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

**అమెరికా వ్యవహారంలో కేంద్రం ఫెయిల్...**

హెచ్-1బీ వీసాలు పొందే దేశాల్లో మొదటి స్థానం మనదే. ఆ ప్రభావం మన పైనే ఎక్కువగా ఉంటుంది. ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైంది. కనీసం ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్- 1బీ వీసాదారులకు మినహాయింపులను సాధించడంలోనూ ఫెయిల్. భారత్ కు నష్టం చేకూర్చేలా ట్రంప్ ఇప్పటికే 50 శాతం టారిఫ్ విధించారు. ఇప్పుడేమో హెచ్-1బీ వీసా ఫీజు పెంచినా ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదు..? ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఈ సమస్యను నేరుగా అమెరికాతో చర్చించాలి. భారతీయ ఐటీ నిపుణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. రెమిటెన్స్ పై ఆధారపడే కుటుంబాలు, సంస్థల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోక తప్పదు' అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం
21.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### టిపిసిసి ఉపాఅధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలంలోని నీర్మాల, రామరాజుపల్లి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై చర్చించిన టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి, రెండు గ్రామాల నాయకులతో మాట్లాడి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని,గ్రామ స్థాయిలో కార్యకర్తలు ప్రజల సమస్యలను గుర్తించి వాటినీ పరిష్కారించాలని,కట్టుబడి పనిచేయాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకి చేరవేయాలని,కచ్చితంగా ఎంపిటిసి సర్పంచులను గెలిపించుకోవాలని రెండు గ్రామాల నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,కొడకండ్ల ఎఎంసి మార్కెట్ చైర్మెన్ నల్ల ఆండాలు, మండల ఎంపీటీసీ క్లస్టర్ ఇంచార్జ్ లు,గ్రామ కో ఆర్డినేటర్ లు, మండల ముఖ్యనాయకులు, నీర్మాల, రామరాజుపల్లి గ్రామాల నాయకులు, మహిళా నాయకురాళ్లు,యూత్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు,గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**



మండల కేంద్రంలోని చిట్యాల గ్రామపంచాయతీ పరిధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలు తయారు చేసి ఆట పాటలతో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోడి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాగవెల్లి ఉపేందర్, అంగన్వాడీ టీచర్ భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ హయత్‌నగర్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



హయత్‌నగర్ బాతుల చెరువు వద్ద గ్రీన్ మాతృ & సంఘీ జగత్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ హయత్‌నగర్ – గ్రీన్ హయత్‌నగర్" కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాం కాలేజీ, ఉస్మానియా యూనివర్సిటీ, సిటీ కాలేజీకి చెందిన విద్యార్థులు చురుకుగా పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "హయత్‌నగర్ వాసులందరూ స్వచ్ఛ హయత్‌నగర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. ప్రతి ఒక్కరు చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేయ కుండా, కేవలం స్వచ్ఛ ఆటోలో మాత్రమే వేయాలి. పరి సరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత" అని అన్నారు. అలాగే ఆయన, "చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం పర్యావరణానికి హానికరం మాత్రమే కాకు ండా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, చెరువులను సంరక్షించుకోవాలి. రాబోయే తరాల కోసం పర్యా వరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత" అని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మహిళా మోర్చా సీనియర్ నాయకులు పార్వతి, అధ్య క్షురాలు గీత, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, కార్యవర్గ సభ్యులు గోవింద చారి, వస్పరి వెంకటేష్, లక్ష్మి దాస్ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలు జన్మదిన వేడుకలు

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయురాలు దేవిశ్రీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే విద్యార్థులు తరగతులను పూలదండలు, రంగురంగుల కార్డులు, బెలూన్లతో అలంకరించి పాఠశాలను పండుగ వాతావరణంగా మార్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు ఆమెతో కలిసి కేక్ కట్ చేయగా, హర్షధ్వానాలు మార్మోగాయి. తోటి ఉపాధ్యాయులు ఆమెకు కేక్ తినిపించి తమ ఆప్యాయతను వ్యక్తం చేశారు. చిన్నారులు పాటలు పాడి, నృత్యాలతో అందరినీ ఆకట్టుకోగా, వాతావరణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ దేవిశ్రీ సేవా తపన, విద్యార్థుల పట్ల చూపుతున్న మమకారం, కృషి గురించి ప్రశంసించారు. "ఆమెలాంటి ఉపాధ్యాయులు పాఠశాల ప్రతిష్టను పెంపొందిస్తారు" అని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేవిశ్రీ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలకాలం నిండు నూరేళ్లు జీవించాలని కోరారు.

## చోరీ కేసును ఛేదించిన ఆర్.జి. ఐ.ఏ పోలీసులు



### ఈ కేసులో ముగ్గురు నిందితులకు రిమాండ్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

శంషాబాద్ డివిజన్ ఎసిపి వి.శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రాళ్లగూడ, రాఘవేంద్ర కాలనీ చెందిన వీరేంద్ర ప్రతాప్ సింగ్ ఇంట్లో దుండగులు 18 లక్షల విలువగల బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు ఆర్ జి ఐ ఏ పోలీసు బృందం సాంకేతిక ఆధారాలను సేకరించి, సీసీటీవీ ఫుటేజ్‌లను ధృవీకరించి, ఇన్ఫార్మర్లను నియమించింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, పోలీసులు గుల్ల శివప్రసాద్, దొంగట్ల లోకేష్, మండలి మనోహర్ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు, విచారణలో, నిందితులు ఈ నేరాలకు పాల్పడినట్లు అంగీకరించినట్టు తెలిపారు. నిందితుల నుండి రికవరీ చేసిన 17 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాలు వెండి ఆభరణాలు, 3 బైకులు, మొత్తం విలువ సుమారు 18 లక్షల ఆస్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్‌కు చెందిన వారి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కేసులో పాలుపంచుకున్న పోలీస్ సిబ్బందికి తగిన విధంగా రివార్డులు అందజేయబడతాయనీ ఏసిపి తెలిపారు. సైబరాబాద్ పోలీసులు ప్రజలకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తలుపులకు తాళాలు వేయాలని, బయటకు వెళ్ళేటప్పుడు ఇళ్లను భద్రపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

### మారేపల్లి మల్లారెడ్డి కరస్పాండెంట్

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని మల్లికార్జున పాఠశాలలో ఆవరణంలో బతుకమ్మ సంబరాలు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లికార్జున పాఠశాలల కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి పాల్గొని,తదనంతరం వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటే ప్రకృతిని పూజించుకునే ఒక గొప్ప పండుగని వివరిస్తూ,అందరికీ బతుకమ్మ మరియు దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ పండగను అందరు ప్రశాంతంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. తదనాంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు బతుకమ్మ ఆటలాడి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ,శ్రీనివాసరావు,కవిత,భార్గవి, సంధ్య విద్యార్థులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాంస్కృతి ప్రతీక మన బతుకమ్మ పండుగ

### వడ్డేపల్లి యామిని

**కూకట్ పల్లి, విశాలభారతి:**

దేవుడిని రోజు పూలతో పూజిస్తామని, దేవుడిని పూజించే పూలనే పూజించే గొప్ప పవిత్రమైన పండుగ బతుకమ్మ అని వడ్డేపల్లి యామిని అన్నారు. కూకట్ పల్లిలో శనివారం జరిగిన బతుకుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి యామిని మాట్లాడుతూ ప్రతీ ఒక్క మహిళ కలిసి మెలిసి ఆడుకునే పవిత్రమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ సందర్భంగా అందరితో క కలిసి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడి పాడి వడ్డేపల్లి యామిని సందడి చేశారు.

## ఉద్యమకారుల యాత్రకు ఘన స్వాగతం

**వలిగొండ, విశాలభారతి:**



ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో నిర్వహిస్తున్న 584 మండలాల చైతన్య యాత్ర శనివారం భువనగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు తరలివెళ్ళి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, యాదాద్రి జిల్లా గౌరవాధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి, గంధ మల్ల బాలయ్య, మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, గౌరవ సలహాదారులు బత్తిని సహదేవ్ గౌడ్, చిలుగూరి సత్తిరెడ్డి, కళాకారుల విభాగం అధ్యక్షుడు మల్ల వెంకటేశం, కన్నెకంటి శ్రీనివాస్ చారి, కొండూరు సత్తయ్య, కదిరేణి స్వామి, దండ మల్లికార్జున్, పల్లెర్ల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ సంస్థల విలీన సభను జయప్రదం చేయండి



**మహబూబాబాద్, విశాలభారతి:**

ఈ నెల 24న బయ్యారంలో జరిగే రెండు విప్లవ సంస్థల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ విలీన సభ కరపత్రం ను మహబూబాబాద్ జిల్లా నడివాడ లో ఆవిష్కరించడం జరిగింది. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా ప్రగతి శీల యువజన సంఘం నాయకులు దారావత్ సుమన్ మాట్లాడుతు దేశంలో ప్రజలను విభజించి పాలించే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు పాలన చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందుత్వ ఫాసిజం పేరుతో ప్రజల మధ్యన మతకల్లోలం సృష్టిస్తూ మైనాటి వర్గాల హక్కులకి భంగం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాలను, అక్రమాలను ప్రశ్నించే వాళ్ళపై కేంద్ర ప్రభు త్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలకు, ప్రజలకు రక్షణ గా ఉన్న విప్లవ కారులను ఎన్ కౌంటర్ పేరుతో హత్యలు చేస్తుందని అన్నారు. ఈ దేశంలో ప్రశ్నించే గొంతుకులను తొక్కి పడుతూ మాట్లాడే హక్కు లేకుండా ప్రభుత్వం చేయాలని చూస్తోంద న్నారు. అందుకనే ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న విప్లవ సంస్థలు ఐక్యం కావాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందని అన్నారు. సిపిఐ ( ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ ( ఎంఎల్)న్యూ డెమోక్రటిక్ రెవల్యూ షనరీ పార్టీలు విలీనం అవుతున్నా యని, ఇకనుండి రెండు విప్లవ సంస్థలు సిపిఐ ( ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీగా ప్రజల కోసం పని చేయాలనే నిర్ణయానికి వచ్చాయని అన్నారు. ఈనెల 24న బయ్యారంలో జరిగే రెండు విప్లవ సంస్థల విలీన సభలో ప్రజలు ప్రజాస్వామిక వాదులు,విద్యార్థి, మేదావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాష, రమేష్, నారాయణ, ఏలేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ, దసరా ఉత్సవాలు

**తిరుమలగిరి, విశాలభారతి:**

జడ్.పి.హెచ్.ఎస్ తొండ పాఠశాలలో శనివారం బతుకమ్మ, దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనైనది. దీనిలో భాగంగా ప్రతి తరగతి నుండి విద్యార్థిని,విద్యార్థులు ఆసక్తితో వివిధ రకాల రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చినారు. దీనిలో అత్యంత పెద్దదిగా ఆరవ తరగతి బతుకమ్మ నిలిచింది. ప్రతి తరగతి నుండి విద్యార్థినులు చక్కగా ముస్తాబై బతుకమ్మ ఆడుతూ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అలాగే దసరా ఉత్సవాలలో భాగంగా జమ్మి కొమ్మ నాటి దాని గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. ఈ సంబరాలలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు వి వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు సైదులు,ధరావత్ వెంకటి, రఘుపతి, సైదులు, నాగన్న, సత్యనారాయణ, పిఈటి వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మునుగోడు, విశాలభారతి:**

విద్య ధరణి మోడల్ స్కూల్ లో శనివారం రోజున ఉపాధ్యాయులు టీచర్లు విద్యార్థులతో కలిసి ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు,అనంతరం విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో. ప్రిన్సిపల్ కరస్పాండెంట్ మదనబోయిన పరమేష్ యాదవ్ ,టీచర్లు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభలకు బయలుదేరిన మానుకోట ప్రతినిధులు



మహబూబాబాద్, విశాలభారతి: పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ 25వ జాతీయ మహాసభలకు మానుకోట జిల్లా నుంచి ప్రతినిధులు బయలుదేరారు. జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, కట్టేబోయిన శ్రీనివాస్‌లు ఈ మహాసభలకు ఎంపికైన వారు. గత నెల మేడ్చల్‌లో జరిగిన సిపిఐ 3వ రాష్ట్ర మహాసభలో వీరిని ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. జాతీయ స్థాయి మహాసభలో పార్టీ భవిష్యత్ దిశ, ప్రజా సమస్యల పరిష్కారం, రైతు-కూలీల హక్కులు, విద్యా-ఆరోగ్య రంగాల బలోపేతంపై విశ్లేషణాత్మక చర్చలు జరగనున్నాయి. దేశ వ్యాప్తంగా పాల్గొనే నాయకులతో కలిసి మానుకోట జిల్లా ప్రతినిధులు కూడా కీలక తీర్మానాల్లో తమ పాత్రను పోషించనున్నారు.



## మెగా సిటీ హై స్కూల్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హాయత్‌నగర్ మండలంలోని మెగా సిటీ హై స్కూల్ ప్రాంగణంలో శనివారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక పరంపరను ప్రతిబింబించే ఈ బతుకమ్మ వేడుకలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్వేతా ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి, అట పాటలతో గెలుగులాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఆరాధన, ఐక్యతకు ప్రతీక అని, ఈ తరహా సాంస్కృతిక వేడుకల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

తొర్రూరు, విశాలభారతి



తొర్రూరు మండలం వెలికట్ట గ్రామానికి చెందిన సుమారు 50 మంది గౌడ కులస్తులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం రాత్రి పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సి రాజేందర్ రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ఝాన్సి రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించే పటిష్టమైన వేదికగా కాంగ్రెస్ నిలుస్తుందని,పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌడ కులస్తులు మాట్లాడుతూ తమ సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీని వీడటానికి నిర్ణయించుకున్నామని, గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ రాఘవరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, గ్రామ కోఆర్డినేటర్ జలగం శ్రీనివాస్, మహిళా మండల నాయకురాలు మాలోతు సునీత రాజేందర్, గ్రామ అధ్యక్షుడు దేవేందర్ రాజు, నాయకులు దేశ గాని బిక్షపతి, కుమార్, బందు వెంకన్న, రామ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

తిరుమలగిరి, విశాలభారతి:

డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డిఎంజేయు) తిరుమలగిరి మండల శాఖnకార్యవర్గాన్ని శనివారం నాడు సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తగట్టు రాజు ,ప్రధాన కార్యదర్శిగా నిమ్మల వీరస్వామి గౌడ్, ఉపాధ్యక్షులుగా పోరెళ్ళ వెంకన్న, సహాయ కార్యదర్శిగా బేతు ప్రవీణ్, కోశాధికారిగా కొమ్ము ప్రవీణ్ , కార్యవర్గ సభ్యులుగా మద్దెల మల్లయ్య చాపలనవీన్ కుమార్ మల్లేష్ నాయక్ ,లింగాలసురేష్ , వెంకన్నగౌడ్ ఎర్రవెల్లి వెంకన్న, ఈదునూరి యాకయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ నాయకులు ఎండి రెహమాన్,బి వెంకటేశ్వర్లు,జిల్లా అధ్యక్షులు షేక్ చాంద్ పాషా, ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు.

## మహిళల భద్రతపై అవగాహన సదస్సు



### రాచకొండ పోలీస్ కమిషనర్ డి సుధీర్ బాబు ఆదేశాల మేరకు

### నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బుల్ జానీ ఆధ్వర్యంలో

### మహిళల కోసం ప్రత్యేక షీ టీమ్స్ అవగాహన సదస్సు

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

రాచకొండ పోలీస్ కమిషనర్ పి. సుధీర్ బాబు ఆదేశాల మేరకు, నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో, బండ్లగూడలోని సహభావన రాజీవ గృహకల్ప గేటెడ్ కమ్యూనిటీ మహిళల కోసం శనివారం ప్రత్యేకంగా షీ టీమ్ అండ్ సిడిఇడబ్ల్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు భద్రత, చట్టపరమైన హక్కులు, వేధింపుల నివారణపై వివరణాత్మకంగా తెలియజేశారు. ఎటువంటి వేధింపులు ఎదురైనా షీ టీమ్ హెల్ప్‌లైన్ 9490617111, డయల్ 100, హాక్ఐ యాప్ ద్వారా వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు, సరూర్ నగర్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కీసర నాగ రాజు, షీ టీమ్ ఇన్స్పెక్టర్ అంజయ్య, సి డి ఈ డబ్ల్యూ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి అనూష, కౌన్సిలర్ స్రవంతి సరిత, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ మెంబర్ శ్రీమతి శోభ రెడ్డి అలాగే సహభావన టౌన్షిప్ సి - బ్లాక్ అధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు, సెక్రటరీ అబీద్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ సంధ్యా రాణి, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో మహిళలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇంద్రనగర్ కాలనీలో స్వచ్ఛభారత్

సికింద్రాబాద్, విశాలభారతి:

సీతాఫల్ మండి డివిజన్ ఇందిరానగర్ రోడ్డు నెంబర్ రెండులో స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమము లో ఎమ్మెల్సీ కొమరయ్య . బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక్ రెడ్డి తో పాల్గొనడం జరిగింది. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



## ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

సీరోల్, విశాలభారతి:

కొత్తూరు (సి) స్టేజి వద్ద రైతుల కోసం ఎరువుల విక్రయ కేంద్రాన్ని కాంపల్లి సొసైటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, తాను మార్కెట్ చైర్మన్‌గా పదవి చేపట్టిన నాటి నుండి ఎల్లప్పుడూ రైతుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, ఎస్సై గండ్ర సంతోష్, వ్యవసాయ అధికారి చాయరాజ్, సొసైటీ సీఈఓ శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు. రైతులు సుధాకర్ నాయక్ నాయకత్వాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

### బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి

మునుగోడు, విశాలభారతి:

మండలంలో కొంపల్లి,చెందిన దాసరి శ్రీశైలం యాదవ్, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు, విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం రోజున మృతుల చిత్రపపటాలకు పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. అనంతరం చీకటిమాడి గ్రామానికి చెందిన పగిళ్ల లక్ష్మమ్మ మృత్తి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డోకూరి వేణుగోపాల్ రెడ్డి,మారగోని అంజయ్య గౌడ్, పగిళ్ల జాని, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## బయ్యారం సభను జయప్రదం చేయండి



నెల్లికుదురు, విశాలభారతి:

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో బయ్యారంలో ఈ నెల 24వ తేదీన జరిగే సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ (అశోక్), సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రటిక్ రివల్యూషనరీ పార్టీలు విలీనం కానున్నాయి. ఈ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రచార గోడపత్రికను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కామ్రేడ్ అశోక్ మాట్లాడుతూ - "కేంద్ర బిజెపి ప్రభుత్వం 'ఆపరేషన్ కగారు' పేరిట గిరిజనులపై నరమేధం సృష్టిస్తోంది. అటవీ సంపద, విలువైన ఖనిజాలను బహుళజాతి సంస్థలకు అప్పగిస్తోంది. విద్యా రంగంలో మతతత్వ పాఠ్యాలు ప్రవేశపెట్టి సమాజాన్ని వెనక్కి లాగుతోంది. పబ్లిక్ సెక్టార్‌ను అంబానీ, ఆదాని వంటి వర్గాలకు అమ్మిపెడుతోంది. రాష్ట్ర పాలన కూడా రైతు సమస్యలను విస్మరిస్తూ యూరియా కొరతతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి తెచ్చింది" అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు, హెచ్ యాకయ్య, సట్ల యాకయ్య, భానోత్ వీరన్న, ఇరుగు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు..

మహబూబాబాద్ విశాల భారతి:

మహబూబాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. స్కూల్ ఆవరణ పూల పరిమళాలతో నిండిపోవడంతో ప్రతి మూలలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆడిపాడి సంబరాలను మరింత ప్రత్యేకంగా మార్చారు. ప్రతి తరగతి విద్యార్థులు స్వయంగా తయారు చేసిన చిన్న బతుకమ్మలు ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల మధుర గాత్రాలు, విద్యార్థుల నాటికలు, నృత్యాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆనందపరిచాయి.



## వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు ఇబ్బంది పెట్టొద్దు

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, విశాలభారతి:

వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు ఇబ్బంది పెట్టొద్దని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. అరాంఘర్ చౌరస్తాలో వ్యాపారుల విజ్ఞప్తి మేరకు ఆయన శనివారం పర్యటించారు. వ్యాపారులు చాలాకాలంగా అక్కడ వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారన్నారు. ఇటీవల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. అయితే వ్యాపారులు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పాత్ ల ఆక్రమించకుండా వెనుక వైపు వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. పోలీసులు, అధికారులు చేసే సూచనలు పాటించాలన్నారు. వారికి ఇబ్బందులు కలిగేలా పనులు చేయొద్దని ఎమ్మెల్యే వారికి చెప్పారు.

## ఎంబిబిఎస్ సీట్ సాధించిన నూతి ప్రణతి ముదిరాజ్

వలిగొండ, విశాలభారతి:



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని గోకారం గ్రామానికి చెందిన నూతి ప్రణతి ముదిరాజ్ తన కృషి, పట్టుదలతో ఓపెన్ కేటగిరీలో ఆర్‌విఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా ప్రణతి తండ్రి నూతి కీర్తన చలపతి ముదిరాజ్ మాట్లాడుతూ - "మా ప్రణతి ఎంతో కష్టపడి కలలు కన్న వైద్య విద్యలో అడుగుపెట్టడం మా కుటుంబానికి గర్వకారణం. ఈ ఆనందాన్ని మీ అందరితో పంచుకోవడం మా హృదయపూర్వక సంతోషం. మా కుమార్తెకు మీ అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ దీవెనలుగా నిలవాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు. నూతి ప్రణతి సాధించిన విజయంపై గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సుచిత్ర ఆనంద్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగను మన రాష్ట్రంలో పూలకు ప్రాధాన్యత ప్రకృతి వైపరీత్య నివేదిక నిచ్చే ఏకైక పండుగ అని, అదేవిధంగా బతుకమ్మ అనగా భూమి,నీరు,మానవుల మధ్య అంతర్గత సంబంధాన్ని తెలియజేసేదే బతుకమ్మ పండుగ అని కొనియాడారు. ఆటపాటలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.




# ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణ ఈరోజు పూలతో, పాటలతో కళకళలాడింది. చిన్నారులు పట్టు లంగావోణీలు, విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలతో బతుకమ్మను ఎత్తుకుని ప్రాంగణంలో అడుగుపెట్టగానే వాతావరణం పల్లెపండుగ వాతావరణంలా మారింది. బతుకమ్మ చుట్టూ నృత్యాలు, పాటలు, పూల వాసనలు కలిసి ఒక అద్భుతమైన దృశ్యాన్ని సృష్టించాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ – "బతుకమ్మ తెలంగాణ ఆత్మ, పూల సౌందర్యానికి ప్రతీక. ఆడపిల్లలు సృష్టించే బతుకమ్మ రూపం మన సంస్కృతి నిలువెత్తు చిహ్నం" అని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ – "బతుకమ్మ కేవలం పండుగ కాదు, ప్రకృతిని గౌరవించడంలో, సమూహంగా ఆనందించడంలో మనకు మార్గదర్శకం" అని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు దేవిశ్రీ కూడా మాట్లాడుతూ – "బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వుకి ఒక ప్రత్యేకత ఉంది. బట్లు కొమ్మ పువ్వు బతుకమ్మలో అగ్రగణ్యంగా నిలుస్తుంది. ఇది కేవలం అందం కోసం కాదు, ఔషధ గుణాలు, శుభాన్ని పంచే శక్తి కలిగిన పుష్పం. మన పూర్వీకులు ప్రకృతి రహస్యాలను బతుకమ్మలో ప్రతిబింబింపజేశారు" అని గర్వంగా చెప్పారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.

# అధికారుల నిర్లక్ష్యమే ప్రజల ప్రాణాలకు ముప్పు

**రాజుపేట,విఠల్ రావు నగర్,కోటకట్ట గ్రామాలను నిర్వాసిత ప్రాంతాలుగా గుర్తించాలి**

**మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు**

**నిర్వాసిత ఉద్యమాన్ని సంపూర్ణ మద్దతు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి - మచ్చా**




**మణుగూరు, విశాలభారతి:**

సింగరేణి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లిందని,దుమ్ము ధూళి వల్ల ప్రజలు ప్రాణాంతక వ్యాధులతో తల్లడిల్లుతున్నారని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాజుపేట,విఠల్ రావు నగర్,కోటకట్ట గ్రామాల ప్రజలు మా గ్రామాలను నిర్వాసిత ప్రాంతాలుగా గుర్తించాలని,ఆర్ %ఆ% ఆర్ ప్యాకేజీ ఇచ్చి మమ్ములను ఈ ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిపిఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి జిఎం కార్యాలయాన్ని మరియు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎస్ ఓటుజి ఎం శ్రీనివాస చారికీ, తహసిల్దార్ అద్దంకి నరేష్ లకు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు పాల్గొని మాట్లాడారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట,విఠల్ రావు నగర్,కోటకట్ట గ్రామాల ప్రజలు మణుగూరు ఓపెన్ కాస్ట్ గని వలన దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణుగూరులో పీకే వన్ గని 1974 సంవత్సరంలో ప్రారంభించారని. ప్రారంభానికి ముందు నుండే రాజుపేట,విఠల్ రావు నగర్,కోటగట్ట ఈ 3 గ్రామాలలో సుమారు 1000 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు,సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కోడిశాల రాములు, బొల్లం రాజు,నైనారపు నాగేశ్వరరావు, పరువు ప్రభాకర్, నరసింహారావు, అనిత, బావుసింగ్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**తొర్రూరు, విశాలభారతి:**

అంగన్వాడి కేంద్రాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏసిడిపిఓ జి విజయలక్ష్మి అన్నారు.సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు అంగన్వాడీ కేంద్రాలలో పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని తొర్రూరు-3వ సెంటర్ లో లబ్ధిదారులకు, భగత్ సింగ్ నగర్ లో వివో మహిళలకు వంటలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని,చిన్నారులు గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఎదుగుదల మహిళల ఆరోగ్యానికి అంగన్వాడి కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రమీల, సుకన్య, ఫిరోజా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఉత్సాహంగా రైసింగ్ స్టార్స్ కార్యక్రమం**




**రాజేంద్రనగర్, విశాలభారతి:**

విద్యార్థులు గొప్ప లక్ష్యాలను సాధించి అందరికీ ఆదర్శంగా నిలవాలని రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేకే కన్వెన్షన్ హాల్లో విజ్ఞాన్ కళాశాలల విద్యార్థులు నిర్వహించిన రైసింగ్ స్టార్స్ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ సాధన కోసం పోరాటం చేశామని, ప్రస్తుతం బీసీలకు రిజర్వేషన్ కోసం ఉద్యమం చేస్తున్నట్లు వివరించారు. రిజర్వేషన్లు సాధించి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ జయప్రద భాయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదు అన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ గౌరీ సతీష్ మాట్లాడుతూ.. ఇంటర్ డిగ్రీ దశలో విద్యార్థులు చెడు విషయాలపై దృష్టి సారించకుండా బాగా చదువుకొని తమ తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.




# వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

**రూ. 10 నాణెం మింగిందని సర్జరీ**

**స్పృహ కోల్పోయి ప్రాణాలు వదిలిన బాలి**

**వనస్థలిపురం తన్వి ఆస్పత్రిలో ఘటన**

**ఎల్బీనగర్, విశాలభారతి:**

పది రూపాయల నాణెం ఓ చిన్నారి నిండు ప్రాణాన్ని బలిగొంది.ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన శేఖర్– జ్యోతిలకు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె నిహారిక (10) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువు తుంది. గురువారంనాడు సాయంత్రం నిహారిక ఇంటి ఆరు బయట ఆడుకుంటూ పొరపాటున పది రూపాయల నాణాన్ని మింగింది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో హుటాహుటిన బాలికను ఎల్బ్ నగర్ వనస్థలిపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకె ళ్లారు. అక్కడి వైద్యులు నిహారికకు ఆపరేషన్ వేసి పది రూపాయల నాణాన్ని తొలగించారు. శుక్రవారం ఉదయం నిహారికను డిశ్చార్జ్ చేశారు. ఆ రోజంతా నిహారిక ఆడు పాడుతూ గడిపి ఆకుపచ్చ రంగుతో అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే ఆపరేషన్ చేసిన ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు బాలికను పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతో ఇన్ఫెక్షన్ అయి బాలిక మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ హాస్పిటల్ ఎదుట ఆందోళన చేపట్టారు.



# సామాజిక సేవే పరమావధి

**తొర్రూరు, విశాలభారతి:**

జాతీయ సేవా పథకం కార్యకర్తలంతా సామాజిక సేవే పరమావధిగా పనిచేయాలని మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సిరికొండ విక్రమ్ కుమార్ అన్నారు. తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ, హెచ్ఎం సుల్తానా లతో కలిసి విక్రమ్ కుమార్ మాట్లాడారు.సామాజిక సేవతోనే పరిపూర్ణ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి జాతీయ%అ% సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) దోహదపడుతుందన్నారు. సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు అరుణ్ , రాధిక, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# వర్కట్‌పల్లి గ్రామంలో వైద్య శిబిరం





**డాక్టర్ దాసరి జ్యోతి ఆధ్వర్యంలో 140 మందికి వైద్య పరీక్షల**

**వలిగొండ, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని వర్కట్పల్లి గ్రామంలో స్వస్తు నారి స్వశక్తత్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో పీహెచ్సీ వర్కట్పల్లి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయి శోభ సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దాసరి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఈఎన్టి, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్, డెంటిస్ట్ వంటి నిపుణులు గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు. మొత్తం 140 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సూపర్వైజర్ పి. వెంకటరమణ, ఎంపీహెచ్ఈఓ సుకన్య, రాధిక, రాజేష్, శిరీష, కృష్ణవేణి, ఎంపీహెచ్ఏఎస్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# విద్యార్థులే దేశానికి పునాది

**డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 సంవత్సరాల జన్మదిన పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 15 రోజులు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం బౌద్ధనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో నేతాజీ విద్యాలయాల యొక్క కరస్పాండెంట్ నిరంజన్ రెడ్డి సమక్షంలో వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను బౌద్ధనగర్ లోని నేతాజీ స్కూలులో నిర్వహించడం జరిగింది . ఈ యొక్క కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ పాల్గొని వికసిత్ భారత్. ఆత్మ నిర్భర్ భారత్. ఆపరేషన్ సింధూర్ ల గురించి వ్యాస రచన పోటీలు నేతాజీ స్కూల్లో నిర్వహించడం జరిగిందని వ్యాస రచనలలో ఉత్తీర్ణులైన విజేతలకు మేమెంటోలు సర్టిఫికెట్లు అందజేస్తూ విద్యార్థులు చక్కగా చదువుకొని చేతి రాతను అందంగా తీర్చిదిద్దుకొని స్వతంత్ర సమరయోధుల యొక్క జీవిత చరిత్రను కూడా వ్యాసరచనలు రాస్తూ వారి యొక్క దేశభక్తిని ప్రతి విద్యార్థి అవలంబించాలని భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ క్రమశిక్షణతో దేశభక్తితో అందరము కూడా ముందుండాలని స్వరూప గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో... జిల్లా కన్వీనర్ కనకట్ల హరి. దత్తు, అంబాల రాజేశ్వరరావు, సుధాకర్, కుమార్, నాగరాజు, ప్రమోద్, వెంకటేష్ ముదిరాజ్, జయంత్, సుబ్బారావు, ఓమ్ము, టైలర్ అశోక్, వెంకటేష్, అమరావతి, ప్రభ, కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



# హయత్‌నగర్‌లో స్వచ్ఛ భారత్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉగాది బాలు ఆధ్వర్యంలో హయత్‌నగర్ బాతుల చెరువు వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక డివిజన్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీత, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, డివిజన్ కార్యవర్గ సభ్యులు వస్పరి వెంకటేష్, సుజాత రెడ్డి, సైదమ్మ, ప్రవీణ్, శక్తి సింగ్, భరత్, జంగా రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు అఖిల్, నాయకులు ప్రణవ్, అభి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆకుల ఇంద్రసేనారెడ్డి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్**

**బత్తుల విప్లవ కుమార్ గౌడ్**




**చౌటుప్పల్, విశాలభారతి:**

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగనుంది. కావున ఈ అవకాశాన్ని మున్సిపాలిటీలోని చౌటుప్పల్ పట్టణం, లక్కారం, తంగడపల్లి, లింగారెడ్డిగూడెం, తాళ్ళ సింగారం,లింగోజిగూడెం లో నివసించే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మరియు బత్తుల విప్లవకుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం వేదిక చౌటుప్పల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉదయం 9 గంటల నుండి 50 సంవత్సరాల వయసు పైబడిన వారు ఇట్టి అవకాశం సద్వినియోగపర్చుకోగలరు.కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకొస్తారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఒక ప్రకటనలో తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం
21.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






## శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఘనంగా బతుకమ్మ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ" బి, బ్లాక్ శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాలలో శనివారం బతుకమ్మ పండుగ సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా దుర్గ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధా మాట్లాడుతూ.. విద్యార్థులతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు బతుకమ్మ విశిష్టతను తెలియజేస్తూ సంబరాలను ఘనంగా నిర్వహించమన్నారు. ఈ మేరకు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ బతుకమ్మ పండుగ పురస్కరించుకొని విద్యార్థులు ఆడి పాడారు. దుర్గామాత ప్రకృతి మాత రంగురంగుల చీరలు ధరించి కొలువు దీరినట్లుగా తొమ్మిది రకాల చీరలతో 9 ప్రతిమలను దుర్గామాత దేవిని అలంకరించి తొమ్మిది రకాల ప్రసాదాలు నైవేధించి భక్తితో పూజించామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పాఠశాల సిబ్బంది, తదితరులు,పాల్గొన్నారు.



## పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని బంచరాయితండ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. పూల సువాసనతో, చిన్నారుల కిలకిలా రావాలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు రంగురంగుల బతుకమ్మలను అలంకరించి సంప్రదాయ గీతాల మధ్య ఆడిపాడారు. విజయలక్ష్మి మాట్లాడుతూ – "బతుకమ్మ మన తెలంగాణ సంస్కృతికి ప్రతీక. పిల్లల ఉత్సాహం మన సంప్రదాయాలను భవిష్యత్తుకు చేర్చుతుంది" అన్నారు. ఉపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ – "ఇలాంటి వేడుకలు పిల్లల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, సామూహికతను పెంపొందిస్తాయి" అన్నారు. చిన్నారులు రంగురంగుల దుస్తులు ధరించి ఆటలు, పాటలతో సందడి చేశారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు వీరిని ప్రోత్సహించారు. నృత్యాలు, పాటలు అందరినీ అలరించాయి. పూల సోయగం, పిల్లల చిరునవ్వులు కలగలిసి బంచరాయితండ పాఠశాలలో జరిగిన బతుకమ్మ వేడుకలను మరింత ప్రత్యేకంగా మార్చాయి.




## గీత కార్మికులకు గీత బందును ప్రకటించాలి

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ

**చౌటుప్పల్, విశాలభారతి:**

కల్లుగీతవృత్తితో జీవనోపాధి పొందుతున్న గీత కార్మికులను ఆధుకునే విధంగా ప్రభుత్వం గీతన్న బంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి రమణ అన్నారు శనివారం చౌటుప్పల్ మండలం ఎల్లగిరి వద్ద ఉన్న రిక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో చౌటుప్పల్ మండల కల్లుగీత కార్మిక సంఘం 10వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. గీతన్న బంధు పథకంతో గీతన్నల బ్రతుకులు మారుతాయని ఆశాబావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని,ఈ వృత్తితో గీత కార్మికులకు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, ఇంకా ఎందరో అంగ వైకల్యం చెందారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, అంగ వైకల్యులైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో తీవ్రజాప్యం జరుగుతోందని తెలిపారు. వెంటనే ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో ఒక నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేసి గీత సంఘం యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం గీత కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బత్తుల లక్ష్మయ్య గౌడ్, అధ్యక్షుడిగా అశోక్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా అంతటి అశోక్ గౌడ్,ఉపాధ్యక్షులుగా ఉష్కాగుల రమేష్ గౌడ్, మల్లెగొని లక్ష్మయ్య గౌడ్, ఉష్కాగుల శ్రీనివాస్ గౌడ్,మారగోని మారయ్య గౌడ్, సహాయ కార్యదర్శులుగా పల్చం అంజయ్య గౌడ్ కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మునుగోడు, విశాలభారతి:**




మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ ప్రైమరీ పాఠశాలలో శనివారం రోజున విద్యార్థులు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగింది.విద్యార్థినీ విద్యార్థులు తీరక్క పూలతో బతుకమ్మలు తయారు చేసి ఆట పాటలతో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,హెచ్ఎం సుంకరి బిక్షం గౌడ్,టీచర్లు, అపర్ణ, లక్ష్మీ ప్రసన్న, భవాని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## మాజీ రాజ్యసభ సభ్యులుని కలిసిన క్యామ మల్లేష్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు క్యామ మల్లేష్ , ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ రాజ్యసభ సభ్యులు గిరీష్ కుమార్ సంఘీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్ గిరీష్ కుమార్ సంఘీ ప్రజా సేవలు, పారిశ్రామిక రంగంలో చేసిన కృషిని ప్రశంసిస్తూ, ఆయన సుదీర్ఘ అనుభవం యువతకు స్పూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.

# వైకుంఠధామాలు సందర్శించిన తుంగతుర్తి రవి

### మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులకు వినతి

### 2 నెలలోపు అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కమిషనర్

**మేడిపల్లి, విశాలభారతి:**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వైకుంఠ దామాలను నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి స్థానిక వైకుంఠ దామాల నిర్వాహకులతో కలిసి సందర్శించారు.కరెంటు స్థంబాలు, సరైన లైట్లు లేకపోవడం,స్నానాల గదులకు తలుపులు లేకపోవడం వంటి మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడం నేరుగా గమనించారు.తుంగతుర్తి రవి వెంటనే ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్, డీ.ఈ, ఏ.ఈ, సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి,రెండు నెలలలోపు కార్పొరేషన్ పరిధిలోని అన్ని స్మశాన వాటికల్లో లైట్లు,వాటి నిర్వహన,తాగునీటి సదుపాయం వంటి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన అంతిమయాత్ర కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని,అందుకోసం వైకుంఠ దామాలలో అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండాలి,ఎక్కడా నిర్లక్ష్యం జరగకూడదని అన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామానుజన్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు




**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తెలంగాణ సంప్రదాయ సంస్కృతికీ ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. హయత్‌నగర్ మండలంలోని శ్రీ రామానుజన్ హైస్కూల్లో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలో విద్యార్థిలు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ పూర్ణచందర్ రావు, రీజనల్ ఇన్చార్జి పద్మావతి, ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్లు సరితా పూర్ణ పాల్గొన్నారు. సంబరాలలో సంప్రదాయ దుస్తులను ధరించిన విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మను చేసి అట పాటలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ మహిళల కు ప్రత్యేక మని చిన్న పెద్ద అందరూ ఈ బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని భవిష్యత్తు తరాలకు తెలియజేస్తూ పండగ జరుపుకుంటారని అన్నారు. ఈ తరహా సాంస్కృతిక వేడుకల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం వేడుకకు మరింత అందాన్ని తీసుకొచ్చింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సంబరాలను ఎంతో ఆనందంగా జరుపుకున్నారు.

## దొంగల గ్యాంగ్‌ను పట్టుకున్న హయత్‌నగర్ పోలీసులు




### విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ మీడియాకు వివరాలను వెల్లడించడం జరిగింది.రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుదీర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్.బీ.నగర్ జోన్ డీసీపీ చి. ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ పర్యవేక్షణలో, అదనపు డీసీపీ బి. కోటేశ్వరరావు, ఏసీపీ పి. కాశి రెడ్డి మార్గదర్శకత్వంలో పోలీసులు దొంగల గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారని ఆయన వివరించారు.హయత్ నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తేదీ 19.09.2025న భగ్యలత, హయత్‌నగర్ వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.ఏ -1 మండ్ల శివ (32), ఏ -2 యల్ల బాలకృష్ణ (35), ఏ -3 మోత్కూర్ శ్రీకాంత్ (35)లను అదుపులోకి తీసుకున్నారు.వీరి వద్ద నుండి 22.6 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ.3 లక్షల నగదు, అర్మనీ రైస్ట్ వాచ్, మారుతి స్విఫ్ట్ కార్ (టిఎస్ 11 యు సి 2360) స్వాధీనం చేసుకున్నామని అన్నారు. తేది 06.09.2025న ఆర్టీసీ మజ్దూర్ నగర్‌లో ఒక ఇంటి తాళం పగులగొట్టి వెండి ఆభరణాలు (6 తులాలు) దొంగిలించారు.తేది 13.09.2025 అర్ధరాత్రి జయసూర్య నగర్, మునగనూరులో ఇంటిని బద్దలు కొట్టి 33 తులాల బంగారం, అర్మనీ వాచ్, రూ.2,000 నగదు దొంగిలించారు.తేది 15.09.2025న అట్టిక గోల్డ్ షాప్, ఎల్.బీ.నగర్‌లో 7.5 తులాల బంగారం ఆభరణాలు అమ్మినట్లు విచారణలో తెలిపారు.

## ఐదేళ్లపాటు శ్రీవారి సొమ్ముదోపిడీ

### వైకాపతో పాటు ఆనాటి అధికారులకు వాటా

**తిరుపతి:** వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భారీగా దోచుకున్నారని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. స్వామి వారి హుండీని వైసీపీలోని కీలక నేతలు దోచుకున్నారని విమర్శించారు. గతంలో టీటీడీ నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా ఇందులో వాటాలు వెళ్లాయని ఆరోపించారు. శనివారం తిరుపతి వేదికగా భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో పవిత్రమైన శ్రీవారి హుండీ నుంచి విదేశీ డాలర్లను దొంగతనం చేసిన కేసును తిరిగి విచారణ చేసేందుకు ఏపీ హై కోర్టు సంచలన ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు భానుప్రకాష్ రెడ్డి.లోక్ అదాలత్‌లో రాజీ అయితే ఏపీ హైకోర్టు ఉత్తర్వులతోనే మళ్లీ విచారణ సాధ్యమని చెప్పుకొచ్చారు. శ్రీవారి పరకామణిలో జరిగిన దొంగతనం కేసును సీబీసీఐడీ విచారణ చేసి అక్టోబర్ 13వ తేదీలోపు సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా పని చేసిన వారికి కూడా ఇందులో వాటాలు ఉన్నాయని విమర్శించారు. సీబీసీఐడీ సీల్డ్ కవర్ నివేదిక హై కోర్టుకు అందిన వెంటనే కీలకమైన వ్యక్తులు జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు. శ్రీ కృష్ణ దేవరాయుల కాలంలో ఇలా దొంగలిస్తే ఉరిశిక్ష విధించారని గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వంలో టీటీడీలో రోజుకూ రూ.10 నుంచి రూ.12 లక్షల వరకు కొట్టేసేవారని... అలా ఎన్నో సంవత్సరాలు దోచుకున్నారని ఆరోపించారు. లెక్కలేనన్ని ఆస్తులు కొన్నారని... చెన్నై సమాచార కేంద్రంలో ఆస్తులను రాయించుకున్నారని భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. లోక్ అదాలత్‌ఈ కేసును రాజీ చేయించేశారని చెప్పుకొచ్చారు. పోలీసు శాఖ నుంచి తీవ్రమైన వత్తిడి వల్ల లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటున్నట్లు విజిలెన్స్ నివేదికలో పేర్కొందని గుర్తుచేశారు. ఈ సంఘటన జరిగినప్పుడు కరుణాకర్ రెడ్డి చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. గోవిందదాసుగా చెప్పుకున్న కరుణాకర్ రెడ్డి అప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అప్పట్లో ఈ కేసు విచారణ చేసిన వ్యక్తి అప్రూవర్‌గా మారారని తెలిపారు. ఆయన సంచలన నిజాలను వెలుగులోకి తీసుకురాబోతున్నారని చెప్పుకొచ్చారు. గతంలో సీసీ టీవీ ఫుటేజ్ మొత్తాన్ని డిలీట్ చేసేశారని ఆరోపించారు. పరకామణిలోనే కాదని... తులాభారంలో కూడా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేతివాటం ప్రదర్శించారని విమర్శించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు పూర్తి అయిపోగానే గత పాలకులకు సహకరించిన వారిని టీటీడీ నుంచి పంపేస్తున్నామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

## దాడుల్లో అక్రమ మద్యం పట్టివేత

### దాదాపు 22లక్షల విలువైన 449 మద్యం బాటిళ్ల స్వాధీనం

**హైదరాబాద్:** దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. దాడుల్లో దాదాపు 22లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక తనిఖీల్లో రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పెద్దఎత్తున నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 585 బాటిళ్లు స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.21.80 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ వద్ద వాహనాల తనిఖీల్లో గోవా, దిల్లీ, హరియాణా నుంచి మద్యం తీసుకువస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్కరు 10 నుంచి 15 బాటిళ్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు- గుర్తించారు. ఈ తనిఖీలో 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ డీటీఎఫ్ అధికారులు ధూల్‌పేట్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి 72 సీసాలు పట్టు-కున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు జరిపి 47 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి పిస్తా హౌజ్ ప్రాంతంలో దాడి చేసి 136 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6.80 లక్షలు ఉన్నట్లు- అధికారులు తెలిపారు. అక్రమ రవాణా వల్ల తెలంగాణ ఎక్సైజ్ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని, దసరా వరకు ప్రత్యేక దాడులు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.